క్లుప్తంగా

రేపు భానుకోటలో మండల పూజ

సింహాద్రిపురం : మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన భానుకోట క్షేత్రంలో ఆదివారం మండల పూజ నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ విశ్వనాథరెడ్డి, సర్పంచ్ మహేశ్వరరెడ్డిలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పూజను పురస్కరించుకుని ఆలయంలో ప్రాతఃకాల పూజ, అష్టోత్తర ద్రవ్య స్నాపనం, కలశ హోమం, మూల మంత్ర హోమం అనంతరం శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

పశువులకు వైద్య పరీక్షలు


పశువులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

సింహాద్రిపురం : మండల పరిధిలోని హిమకుంట్ల గ్రామంలో శుక్రవారం సింహాద్రిపురం, బిదినంచర్ల పశువైద్యులు శివప్రసాద్, మహమ్మద్ యూనస్‌ల పర్యవేక్షణలో పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గ్రామంలో పశువులకు ముందుజాగ్రత్త చర్యలలో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏహెచ్ఏలు వసంతలక్ష్మి, చరణ్, మౌనిక, గోపాల మిత్ర సురేష్, పశుమిత్ర మురళి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి దర్గా ఉరుసు


మల్లేల గ్రామంలో ఇమాంబి దర్గా మసీదు

తొండూరు : మండలంలోని మల్లేల గ్రామంలో ఉన్న శ్రీసయ్యదా ఇమాంబి దర్గా ఉరుసు శనివారం నుంచి రెండు రోజులపాటు నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ వారు తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ తెలుపుతూ ఈనెల 18వ తేదీన శనివారం రాత్రి 9 గంటలకు ఊరేగింపు నిర్వహించనున్నారు. 19వ తేదీన ఆదివారం 9 గంటలకు ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గొప్ప ఖవ్వాలి పోటీ జరుగుతుందన్నారు. హిందు, ముస్లిం సోదరులందరూ గంధం, ఉరుసు మహోత్సవంలో పాల్గొని అమ్మవారి దివ్య ఆశీస్సులు పొందాలని వారు కోరారు.

పసరు వైద్యులకు పురస్కారం


ప్రముఖుల నుంచి గౌరవ డాక్టరేట్ పత్రాలను అందుకుంటున్న యాదాటి సోదరులు

పులివెందుల టౌన్ : పసరు వైద్యులు యాదాటి సోదరులు రామగంగాధరరెడ్డి యాదవ్, యాదాటి వివేకానందరెడ్డి యాదవ్‌లకు అరుదైన గౌరవం లభించింది. కరోనాలో వీరి సేవలను గుర్తించి ఢిల్లీకి చెందిన మ్యాజిక్ అండ్ ఆర్ట్ యూనివర్శిటీ గురువారం సాయంత్రం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది.

19న వైఎస్ సిలార్ స్మారక పురస్కారాలు

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన రంగస్థల కళాకారుడు, శ్రీ నవ్యకళానికేతన్ వ్యవస్థాపక అధ్యక్షులు వైఎస్ సిలార్ తొలి వర్ధంతి సందర్భంగా ఈనెల 19వ తేదీన స్థానిక బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో స్మారక పురస్కారాలను అందజేయనున్నట్లు నిర్వాహకులు వైఎస్ సాయిబాబా తెలిపారు. సాయంత్రం 5.30 గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి జిల్లా మేధావి సమాఖ్య అధ్యక్షులు ఎం.వివేకానందరెడ్డి అధ్యక్షత వహించనున్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష ముఖ్య అతిథిగా, షేక్ హుసేన్ సత్యాగ్ని విశిష్ట అతిథిగా హాజరు కానున్నారు. వివిధ రంగాలలో సమాజానికి సేవలు అందిస్తున్న 30 మంది ప్రముఖులకు వైఎస్ సిలార్ పేరిట ఉగాది పురస్కారాలను అందజేయనున్నట్లు తెలిపారు.

24న ఆరాధన

కడప కల్చరల్ : కడప నగరం పాత బస్టాండులోని శ్రీ సద్గురు అవధూతేంద్రస్వామి జ్ఞాన మందిరంలో ఆయన 45వ ఆరాధన మహోత్సవం ఈనెల 24వ తేదీన నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సాయంత్రం 6 గంటలకు గ్రామోత్సవం ఉంటుంది.

ఘనంగా జ్యోతి ఉత్సవాలు

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని ప్రకాష్‌నగర్‌లోని శ్రీ బాలాత్రిపుర సుందరీదేవి ఆలయంలో 5వ వార్షికోత్సవాల సందర్భంగా శుక్రవారం ఘనంగా జ్యోతి ఉత్సవాలను నిర్వహించారు. గురువారం అర్ధరాత్రి ప్రారంభమైన చౌడేశ్వరి జ్యోతి ఉత్సవాలు శుక్రవారం ఉదయం వరకు నిర్వహించారు. అమ్మవారి జ్యోతులను తలమీద ఉంచుకుని మంగళవాయిద్యాల సందడికి అమ్మవారి నామ స్మరణలు చేస్తూ భక్తులు నృత్యం చేశారు. ప్రకాష్‌నగర్‌లో అన్ని ప్రాంతాల్లో జ్యోతులను ఊరేగించారు.

ప్రకృతి వ్యవసాయం.. ఆశాజనకం


సహజసిద్ధమైన ద్రవజీవామృతం, కషాయాలు చేస్తున్న రైతులు


ప్రకృతి వ్యవసాయంలో సాగులో పొలంబడి నిర్వహణ దృశ్యం

- సహజ సిద్ధ కషాయాల వాడకం
- ప్రభుత్వ ప్రోత్సాహంతో రైతుల మొగ్గు

ముద్దనూరు : ప్రకృతిలో లభించే సహజసిద్ధమైన ఆకులు అలములతో కషాయాలు తయారు చేసి వాటిని సాగులో వినియోగించి నాణ్యమైన పంటలను ఉత్పత్తి చేయడానికి రైతులు ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వ సహకారం, కమ్యూనిటీ నేచర్ ఫార్మింగ్ సిబ్బంది ప్రోత్సాహంతో ప్రకృతి వ్యవసాయం ముందుకుసాగుతోంది.

కషాయాలు, ద్రావణాల తయారీ, వినియోగం

ప్రకృతి వ్యవసాయం సాగుచేయడంలో ప్రధానమైన అంశం క్రిమి సంహారక మందులు, రసాయన ఎరువుల వాడకాన్ని నిషేధించడం. సహజ సిద్ధమైన కషాయాలను, ఆకులను వినియోగించి ఎరువులను తయారు చేసి పంటలకు పిచికారి చేయడం. రైతులు తమ పరిసర ప్రాంతాల్లో విరివిగా లభించే వనరులను ఉపయోగించుకుని ఈ కషాయాలు తయారు చేసుకుంటున్నారు. వావిలాకు కషాయం, ఇంగువ కషాయం, వేప కషాయంలతో పాటు ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, చేపపిల్ల ద్రావణం, ఆవు మూత్రము, ఆవు పేడ, జిల్లేడు, ఉమ్మెత్త తంగేడులాంటి ప్రకృతిలో లభించే పదార్థాలను సేకరించి రైతులు సహజ సిద్ధమైన సత్తువలను పంటలదిగుబడికి వినియోగిస్తున్నారు.

సాగులో దుష్ప్రభావాలు దూరం

ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటల ఉత్పత్తుల్లో దుష్ప్రభావం వుండదని ఇందులో రసాయన, హాని కలిగించే క్రిమిసంహారక మందుల వినియోగం వుండదని వ్యవసాయాధికారులు అంటున్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా నాణ్యమైన దిగుబడి లభిస్తుందని, భూమి సారవంతం అవుతుందని, చీడపీడల నివారణకు ఎంతో ఉపయోగకరంగా వుండడంతో రైతులు ఈ వ్యవసాయంపై ఆసక్తి కనబరుస్తున్నారని సిబ్బంది అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అధిక ప్రోత్సాహం అందిస్తున్నాము



పకృతి వ్యవసాయానికి ప్రభుత్వ సహకారం వుండడంతో రైతులకు అధిక ప్రోత్సాహం అందిస్తున్నాము. సాగులో విత్తన శుద్ధి మొదలు, తెగుళ్ల, చీడపీడల నివారణ, నాణ్యమైన దిగుబడితో పంట చేతికొచ్చే వరకు అన్ని రకాల సాగులో ప్రకృతి వ్యవసాయం రైతులకు ఎంతో ప్రయోజనం. ప్రస్తుతం మండలంలో సుమారు 900 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం సాగులోవుంది. కషాయాలు, ఘన, ద్రవ జీవామృతం తయారీలో సిబ్బంది సాయంతో రైతులకు పూర్తి అవగాహన కల్పిస్తున్నాము.

–వెంకటకృష్ణారెడ్డి, మండల వ్యవసాయాధికారి

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి


మొక్కలు నాటుతున్న ఆర్టీసీ డీఎం ఉమామహేశ్వరరెడ్డి, తదితరులు

పులివెందుల రూరల్ : ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా మొక్కలు నాటాలని ఆర్టీసీ డీఎం ఉమామహేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం పులివెందుల నూతన ఆర్టీసీ డిపోలో డీఎం ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్ షరీఫ్ సొంత నిధులతో వివిధ రకాల మొక్కలను తీసుకురావడంతో వాటిని ఇక్కడ నాటామన్నారు. మొక్కలు నాటిన తర్వాత వాటి పరిరక్షణ కూడా మనం చూసుకోవాలని తెలిపారు. ఆర్టీసీ సిబ్బంది కుళ్లాయప్ప, సూర్యనారాయణ, గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం (రేపు) ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్స్, మొటిమలు, బొదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రముఖ గుండె జబ్బు నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ వైద్యులు డాక్టర్ డి.వి.నారాయణరెడ్డి ఆసుపత్రిలో 24 గంటలు అందుబాటులో ఉండి ఎండోస్కోపీ, కోలోనోస్కోపీ, అన్ని జీర్ణకోశ, లివర్, ప్యాంక్రియాస్ క్యాన్సర్‌లకు ఆపరేషన్లు చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

వెనుకబడిన విద్యార్థులు పురోగతి సాధించాలి


ఉపాధ్యాయుల రికార్డులను పరిశీలిస్తున్న లిప్ మానటరింగ్ అబ్జర్వర్ శ్రీనివాసులు

వేంపల్లె : పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థులు చదవడం, రాయడంలో పురోగతి సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని లిప్ మానటరింగ్ అబ్జర్వర్ సి.శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేసి ఉపాధ్యాయుని వ్యక్తిగత లిప్ రికార్డులను పరిశీలించి వారికి తగిన సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లెసెన్ ప్లాన్స్, ప్రాక్టీస్ పిరియడ్, కేస్ స్టడీ, విద్యార్థులకు గ్రూపు విభజన వంటి వాటిని సిద్ధం చేసుకుని ఉపాధ్యాయులు బోధన సాగించాలన్నారు. అనంతరం కార్యక్రమంలో హెచ్ఎం వెంకటరమణయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత అవార్డులకు

దరఖాస్తుల ఆహ్వానం

పులివెందుల టౌన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రవేశపెట్టిన స్వచ్ఛ సర్వేక్షన్-2023లో భాగంగా పారిశుధ్య, ఘన వ్యర్థాల నిర్వహణ, సామాజిక మరుగుదొడ్ల నిర్వహణ, సెప్టిక్ ట్యాంక్ శుభ్రత, వ్యర్థాల శుద్ధీకరణ, చెత్తతో కళాకృతులు తయారీ, తడి, పొడి చెత్త వినియోగం వంటి విభాగాల కింద కృషి చేస్తున్న మహిళలు ఈ అవార్డులకు దరఖాస్తులు చేసుకోవచ్చునని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తెలుపుతూ ఈనెల 22వ తేదీలోపు మున్సిపల్ ఆఫీస్‌లో దరఖాస్తు చేసుకోవాలని.. జూన్ 5వ తేదీన జరగనున్న ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలలో అవార్డులను అందజేస్తారన్నారు. మరిన్ని వివరాలకు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

కేజీబీవీకి ఆర్వో ప్లాంట్ వితరణ


ఆర్వో ప్లాంటు, ఇన్వర్టర్లతో ఉపాధ్యాయులు, విద్యార్థినులు

వల్లూరు : స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయానికి అభయ ఫౌండేషన్, శివశక్తి సంస్థల ఆర్థిక సహకారంతో ఆర్వో ప్లాంట్, రెండు ఇన్‌వర్టర్లను వితరణగా అందజేశారు. స్థానిక కేజీబీవీలో శుక్రవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో వారి తరుపున మదర్ థెరిసా సేవా సమితి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జూటూరు విజయకుమార్ చేతుల మీదుగా రూ. 1.50 లక్షల విలువ చేసే ఆర్వో ప్లాంటుతో పాటు రెండు ఇన్‌వర్టర్లను విద్యాలయ ప్రిన్సిపాల్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నజీమున్నీసా మాట్లాడుతూ ఇక్కడ చదువుకుంటున్న బాలికలు రాత్రి పూట విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు ఇబ్బందులు పడకుండా అభయ ఫౌండేషన్, శివశక్తి సంస్థల వారు తాగునీటి కోసం 250 లీటర్ల సామర్థ్యం గల ఆర్వో ప్లాంటును, రెండు ఇన్‌వర్టర్లను వితరణగా ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అనాథ వృద్ధులకు అన్నదానం

వేంపల్లె : స్థానిక రాజీవ్‌నగర్ కాలనీలోని మదర్ థెరిస్సా అనాథ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం కన్నడ పవర్ స్టార్ పునీత్‌రాజ్‌కుమార్ జయంతి సందర్భంగా నంది మండలం గ్రామానికి చెందిన డాక్టర్ అరుణ్‌కుమార్ అనాథ వృద్ధులకు అన్నదానంతో పాటు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం వృద్ధుల సమక్షంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో డాక్టర్ దయాన, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేల కొరిగిన విద్యుత్ స్తంభాలు


గంగవరం వద్ద విరిగి పడిన విద్యుత్ స్తంభం

కమలాపురం : మండల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం రాత్రి వీచిన భారీ గాలులకు 9 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. గంగవరంలో 4, లేటపల్లెలో 1, సముద్రంపల్లె, పి.కొత్తపల్లెలో మరో 4 విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయని, దాదాపు రూ.80 వేల వరకు నష్టం వాటిల్లిందని ట్రాన్స్‌కో సబ్ ఇంజినీర్ విద్యాసాగర్ తెలిపారు. పడిపోయిన స్తంభాల స్థానాల్లో కొత్త విద్యుత్ స్తంభాలు త్వరితగతిన ఏర్పాటు చేస్తామని, ప్రజలు సహకరించాలని ఆయన తెలిపారు.

తెలుగువారు గర్వించదగ్గ రచయిత్రి మొల్ల

– వైవీయూ వీసీ ఆచార్య జింకా రంగజనార్దన

వైవీయూ : రామాయణాన్ని తెలుగువారందరికీ అర్థమయ్యేలా రచించిన కవయిత్రి మొల్ల మన జిల్లా వాసి కావడం మనందరికీ గర్వకారణమని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య జింకా రంగ జనార్ధన అన్నారు. శుక్రవారం వైవీయూ తెలుగుశాఖ, మొల్ల సాహితీ పీఠం సంయుక్త ఆధ్వర్యంలో మొల్ల సప్తశతజయంతి సభ విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్‌బ్లాక్‌లో నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ ప్రతియేటా మొల్ల జయంతిని విశ్వవిద్యాలయం అధికారికంగా నిర్వహిస్తుందని ప్రకటించారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ వైఎస్ హయాంలో మొల్ల జయంతికి నిధులు కేటాయించి, అధికారికంగా నిర్వహించారన్నారు. ఆర్ట్స్ విభాగం డీన్ ఆచార్య టి.రామప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగుభాష ఉన్నంతకాలం మొల్ల జనంలో జీవించి ఉంటారన్నారు. తెలుగుశాఖ ఆచార్యులు ఎస్.ఈశ్వరరెడ్డి, మొల్ల సాహితీపీఠం వ్యవస్థాపకులు గానుగపెంట హనుమంతరావు,తదితరులు పాల్గొన్నారు.

అక్రమ గృహ నిర్మాణదారులకు నోటీసులు

కడప కార్పొరేషన్: లే అవుట్లలో అక్రమంగా నిర్మిస్తున్న గృహ నిర్మాణాలకు నోటీసులు జారీ చేయాలని కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. శుక్రవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా 40వ డివిజన్ చౌటపల్లె, ఎస్‌బీఐ కాలనీల్లో ఆయన పర్యటించారు. కొత్తగా నిర్మిస్తున్న ఇళ్లకు సంబంధించి సెట్‌బ్యాక్స్, ప్లాన్లు పరిశీలించాలని టౌన్‌ప్లానింగ్ సిబ్బందిని ఆదేశించారు. రెడ్డి కాలనీ నుంచి రైల్వేగేట్ వరకూ కాలువల్లో పూడిక ఎప్పటికప్పుడు తీసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్‌బీఐ కాలనీలోని పార్కులో చిన్నారులు ఆడుకొనుటకు ఎక్కువ స్థలం ఏర్పాటు చేసేలా ప్రణాళిక సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మధ్యాహ్నం జర్నలిస్టు కాలనీ పార్కును పరిశీలించి ఓపెన్ జిమ్, ప్లాట్‌ఫారమ్ మరమ్మతులు చేయించాలన్నారు. గాంధీ పార్కులో గ్రీనరీ ఏర్పాటు చేయాలన్నారు. గురువారం రాత్రి భారీ వర్షం కురిసిన నేపథ్యంలో రాత్రి 9.30 గంటలకు ఆయన నగరంలో పలు ప్రాంతాలను పరిశీలించి వర్షపు నీరు ఎక్కడా నిలవకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో నగరపాలక ఇంజినీరింగ్ అధికారులు, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నపిల్లలకు ఆధార్ కార్డు కల్పించాలి


మాట్లాడుతున్న కమిషనర్ నరసింహారెడ్డి

పులివెందుల టౌన్ : ఐదేళ్లలోపు చిన్నపిల్లలకు తప్పనిసరిగా ఆధార్ కార్డు కల్పించాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో ఆయన ఐసీడీఎస్ అంగన్‌వాడీ సిబ్బందికి సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో ఆధార్ కార్డులేని చిన్నపిల్లలను గుర్తించి వారికి ఆధార్ కార్డు కల్పించడమే కాకుండా మున్సిపల్ ఆఫీస్ ద్వారా బర్త్ సర్టిఫికెట్ కచ్చితంగా ఇప్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

చిరుధాన్యాలు వాడి ఆరోగ్యంగా ఉండండి


కమలాపురం : మాట్లాడుతున్న జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు మేనేజర్ ఆనంద్ నాయక్


పులివెందుల : మానవహారంగా ఏర్పడిన ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థులు

పెండ్లిమర్రి : ప్రకృతి వ్యవసాయ పద్ధతితో సాగు చేసిన చిరుధాన్యాలను వాడి ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు మేనేజర్ ఆనంద్ నాయక్ తెలిపారు. పెండ్లిమర్రి మండల సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం చిరుధాన్యాల మహోత్సవంపై మండల సమాఖ్య సభ్యులకు ఆయన అవగాహన సమావేశం నిర్వహించి మాట్లాడారు. చిరుధాన్యాల ద్వారా తయారు చేసిన ఉత్పత్తులను వాడితే పిల్లలకు, పెద్దలకు మంచి పౌష్టికాహారం లభిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చిరుధాన్యాల సాగును పెంచేందుకు రైతులకు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ రఘునాథ్‌రెడ్డి, జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు వెంకటస్వామి, రెడ్డయ్య, తహసీల్దార్ ఉదయభాస్కర్ రాజు, ఎంపీడీఓ అల్తాఫ్ హుస్సేన్, ఏపీఎం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పులివెందులలో..

పులివెందుల టౌన్ : చిరు ధాన్యాలు తిందాం.. ఆరోగ్యంగా ఉందామని కళాశాల ప్రిన్సిపాల్ సర్దార్ బేగ్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో చిరుధాన్యాలపై అవగాహన ర్యాలీని కళాశాల నుంచి పార్నపల్లె రింగ్ రోడ్డు మీదుగా పూలంగళ్ల సర్కిల్ వరకు నిర్వహించారు. అక్కడే విద్యార్థులు మానవహారంగా ఏర్పడి చిరుధాన్యాల ప్రాముఖ్యత గురించి నినాదాల ద్వారా ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు రాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా ఒక వరం


సచివాలయంలో ఆసరా లబ్ధిదారుల జాబితాను ప్రదర్శిస్తున్న ఏపీఎం, తదితరులు

వేముల : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్సార్ ఆసరా పథకం డ్వాక్రా మహిళలకు వరమని వైఎస్సార్ క్రాంతి పథకం ఏపీఎం జిలానిబాషా తెలిపారు. మండలంలోని సచివాలయాలలో శుక్రవారం లబ్ధిదారుల జాబితాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం నిధులను వారి ఖాతాలలో జమ చేస్తారన్నారు. మండల వ్యాప్తంగా 498 మహిళా సంఘాలను 4,898 మంది లబ్ధిదారులకు రూ.4.10 కోట్ల మేర లబ్ధి చేకూరుతుందన్నారు. ఇప్పటికే అన్ని గ్రామాల వారీగా డ్వాక్రా మహిళల జాబితా సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో సీసీలు, అనిమేటర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన ఉత్సవ విగ్రహాల చర ప్రతిష్ట


నూతన ఉత్సవ విగ్రహాల చర ప్రతిష్టలో ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు

వేంపల్లె : స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శుక్రవారం గోదాదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి నూతన ఉత్సవ విగ్రహాల చర ప్రతిష్ట మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాజారావు అధ్యక్షతన అర్చకులు ప్రసాద్‌శర్మ నేతృత్వంలో ఈ ఉత్సవ విగ్రహాలకు మూడు రోజులపాటు వైభవంగా పూజలు నిర్వహించారు. గణపతిపూజ, పూర్ణాహుతి, మహా మంగళ హారతి తదితర పూజాది కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం నూతన విగ్రహాలను తులభారం నిర్వహించారు. అలాగే వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. పట్టణ పురవీధుల గుండా ఉత్సవ విగ్రహాలను గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం, మహిళా మండలి సంఘం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

లింగాలలో కుక్కల బెడద


లింగాలలో గుంపుగా ఉన్న కుక్కలు


శంకర్ కాలికి గాయం చేసిన కుక్కలు

లింగాల : మండల కేంద్రంలో వీధి కుక్కల బెడద తీవ్రమైంది. ఎక్కడ చూసినా కుక్కలు పశువులపైన, గొర్రెలపై దాడులు చేయడమే కాక మనుషులపై దాడి చేసి గాయాలపాలు చేస్తున్నాయి. శంకర్ అనే వ్యక్తిపై కుక్క దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో గ్రామస్తులు వెంటనే కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడాలని ఎంపీడీఓ సురేంద్రనాథ్‌కు ఫిర్యాదు చేశారు. ద్విచక్ర వాహనాలలో వెళుతున్న వారిని సైతం వెంటాడుతున్నాయని వారు తెలిపారు.

నులి పురుగుల నివారణతో రక్తహీనత దూరం


రికార్డులను పరిశీలిస్తున్న అడిషనల్ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి

వల్లూరు : నులి పురుగులను నివారించడం వలన రక్త హీనత దూరమవుతుందని అడిషనల్ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి అన్నారు. మండలంలోని తోల్లగంగనపల్లె గ్రామ సచివాలయ పరిధిలోని 5 నెలలు నిండిన గర్భిణులకు శుక్రవారం ఆయన ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలోని టీబీ పేషంట్ల గృహాలను సందర్శించి పలు సూచనలు ఇచ్చారు. సచివాలయంలో ఏఎన్ఎమ్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఇచ్చిన లక్ష్యాలను సకాలంలో చేరుకోవడానికి కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ శివరామిరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.